# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గిరాకీ దృష్ట్యా ఏ పంటలు సాగుచేయాలో రైతులకు ముందుగానే చెప్పాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ 'మన ఊరు-మాటా మంతి' కార్యక్రమంలో భాగంగా ఈరోజు రావివలస గ్రామస్తులతో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సంభాషించారు.
- ❖ కొత్తగా రేషన్ కార్డు ధరఖాస్తు చేసుకునేందుకు వివాహధృవీకరణ పత్రం అవసరం లేదని మంత్రి నాదేండ్ల మనోహర్ స్పష్టం చేశారు.
- ❖ రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టుల కోసం 50 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించనుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

==========================

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గిరాకీ దృష్ట్యా ఏ పంటలు సాగుచేయాలో రైతులకు ముందుగానే చెప్పాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పంటలు, గిట్టుబాటు ధరలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘంతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొగాకు, కోకో పంటలను వాణిజ్య సంస్థలు నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. మద్దతు ధర తగ్గితే రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. పండ్ల రసాలపై జీఎస్టీ తగ్గింపుకు కృషి చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా మరికొద్ది సేపట్లో ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లనున్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి వెళ్తున్న ముఖ్యమంత్రి పలువురు కేంద్రమంత్రులతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఉప సంఘంతో సమీక్ష నిర్వహించారు. అలాగే ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం నీతి ఆయోగ్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కానున్నారు.

========================

'మన ఊరు-మాటా మంతి' కార్యక్రమంలో బాగంగా ఈరోజు శ్రీకాకుళం జిల్లా లోని రావివలస గ్రామ ప్రజలతో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ముఖాముఖి నిర్వహించారు. టెక్కలిలోని భవానీ థియేటర్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులపై రావివలస గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రస్తావించిన స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా ఈ కార్యక్రమంలో తాగు నీరు, సాగు నీరు, మురుగు నీటి కాల్వుల నిర్వహణ, చెరువుల సమస్యలు, ఉపాధి హామీ పథకం, పాఠశాల విద్య మొదలగు అంశాలపై దృష్టి సారించారు. గ్రామంలోని పలు అభివృద్ధి పనులతో పాటూ.. ఇతర నిర్మాణాలకు 15 కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి మరో 500 ఎకరాలను కేటాయిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఐఏఎల్ సంస్థకు 500 ఎకరాల భూ కేటాయింపునకు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవలే ఆమోదం తెలిపింది. ప్రతి సంవత్సరం 3 కోట్ల 6o లక్షల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలుగా మూడు దశల్లో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి బృహత్తర ప్రణాళికను రూపొందించారు. దీని ప్రకారం 2,703 ఎకరాలు కేటాయించాల్సి ఉండగా గత ప్రభుత్వం 2,203 ఎకరాలను మాత్రమే కేటాయించింది. భవిష్యత్ అవసరాలతో పాటూ ఏవియేషన్ హబ్, ఇతర అవసరాల కోసం 500 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఈరోజు ఆదేశాలు జారీ చేసింది.

========================

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా ఆధునీకరించిన 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రాజస్థాన్ నుంచి దృశ్యమాధ్యమ విధానంలో ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్‌ను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. అయితే సూళ్లూర్ పేట రైల్వే స్టేషన్ లో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రానికి సంబందించిన రైల్వే ప్రాజెక్టుల కోసం 50 వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించనుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోపే కొత్త రేషన్ కార్డులను మంజూర్ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్తగా రేషన్ కార్డు ధరఖాస్తు చేసుకునేందుకు వివాహ ధృవీకరణ పత్రం అవసరం లేదని

మంత్రి స్పష్టం చేశారు. ఈరోజు ఆయన అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మే 7 నుంచి రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టామని తెలిపారు. 60 వేల మంది కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఉన్న కార్డుల నుంచి పేరు చేయాలని 44 వేల మంది, చిరునామా మార్పు కోసం 12,500 మంది దరఖాస్తు చేసుకున్నారని మంత్రి వెల్లడించారు. రేషన్ కార్డులకు ఈకేవైసీ తప్పని సరి అని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి కార్డును ఈకేవైసీ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

==========================

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... గత సంవత్సరం ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీని “వెన్నుపోటు దినం”గా నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ రోజున ప్రజలతో కలిసి నిరసనలు చేపడతామని, జిల్లా కలెక్టర్లను కలిసి హామీల డిమాండ్ పత్రాలను సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా కలిసి రావాలని ఆయన కోరారు.

==========================

ప్రధానమంత్రి జన్ మన్ గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మండలం చెప్పవానివలస గ్రామంలో వివిధ దశలలో ఉన్న పీఎం జన్ మన్ గృహ నిర్మాణాలను ఈరోజు పరిశీలించిన ఆయన త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణానికి సంబంధించిన రెండవ విడత బిల్లులు మరి కొద్ది రోజుల్లో మంజూరు కానున్నాయని కలెక్టర్ వెల్లడించారు.

==========================

ప్రజలు ప్రకృతితో మమేకం కావాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు నిర్వహించిన జీవ వైవిధ్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చెట్లను తొలగించడం కాదని.. మొక్కలను నాటడం నేర్చుకోవాలని చెప్పారు. ప్రకృతి నుంచి తీసుకోవడం మాత్రమే కాదని ఇవ్వడం కూడా అలవాటు చేసుకోవాలన్నారు. సహజంగా పెరిగిన మొక్కలు మనకు అవసరం కాకపోవచ్చని.. కానీ అవి జీవవైవిధ్యానికి తోడ్పడతాయని వివరించారు. ప్రతీ ఒక్కరూ తమ తమ పెరట్లో ఏం చేయగలమో జీవ వైవిధ్యానికి ఎలా తోడ్పడగలమో ఆలోచించాలని సూచించారు.

==========================

దక్షిణ కొంకణ్, గోవా ఆనుకుని తూర్పు అరేబియా సముద్రంపై అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడన ద్రోణి తెలంగాణ వరకు విస్తరించిందని.. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు.. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడన ప్రభావంతో ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు పలు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గడచిన 24 గంటల్లో.. అమరావతిలో 9 సెంటీమీటర్లు, మాచర్లలో 6, విశాఖపట్నం, మచిలీపట్నం, జంగ మహేశ్వరపురంలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

==========================
==========================